ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్ణాటక వార్తలు
సోమవారం 16 డిసెంబరు 2024





సహజ వనరుల పరిరక్షణ అందరి బాధ్యత

ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శశిధర్

ఘనంగా ఇంధన సంరక్షణ దినోత్సవం

6



ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

శివరామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

తరలివచ్చిన భక్తజనం

6



పెరిగిన.. బాలికల సంఖ్య..!

- భ్రూణహత్యలాంటి దారుణాలు చోటుచేసుకున్నా... ● ఏటా లింగనిష్పత్తిలో ఆశాజనకంగా వృద్ధి



బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడిచిన మూడేళ్లలో బాలికల జననం పెరుగుతోంది. ఇది సమాజానికి సంతోషించదగ్గ విషయమే. సంచలనం అనిపించేలాంటి భ్రూణహత్యలు కొనసాగుతున్నా వరుసగా మూడేళ్లలో బాలికల జననం పెరుగుతోంది. డిసెంబరు ప్రారంభం నాటికి గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 914 మంది మహిళలు ఉన్నట్టయ్యింది. గడిచిన రెండేళ్లతో పోలిస్తే 16 శాతం ప్రగతి సాధించినట్టు అయ్యింది. లింగనిష్పత్తిలో తేడా సమాజంలోని అన్నివర్గాలను ఆందోళన కలిగించింది. ప్రభుత్వం ఎనలేని నిబంధనలు అమలు చేస్తున్నా గుట్టుచప్పుడు కాకుండా భ్రూణహత్యలు కొనసాగాయి. నకిలీ డాక్టర్లు మండ్య, రామనగర ప్రాంతాలలో బెల్లం తయారీ కేంద్రాలకు అనుబంధంగా ఉండే షెడ్లలో స్కానింగ్ సెంటర్లు ద్వారా శిశునిర్ధారణ చేసేవారు. ఆడశిశువు జన్మిస్తుందనే విషయం తెలుసుకుని భ్రూణహత్యలు జరిపించారు. ఇలా కొన్నేళ్లకాలంగా సాగిన అత్యంత భయంకరం అనిపించే నేరానికి ఇటీవల పోలీసులు గుర్తించారు. భ్రూణహత్యల ముఠాను అరెస్టు చేశారు. వారికి అనుబంధంగా ఉత్తర కర్ణాటకలో పనిచేసే కొందరిపట్ల నిఘా పెట్టి కట్టడి చేశారు. ఇదంతా కొన్ని నెలల ప్రక్రియ అయినా వరుసగా మూడేళ్లపాటు ఆడశిశువుల జననం పెరుగుతుండటంతో వైద్య ఆరోగ్యశాఖ సంతృప్తి వ్యక్తం చేస్తోంది. భ్రూణహత్యలను పూర్తిస్థాయిలో నివారించాలని భావించిన వైద్య ఆరోగ్యశాఖ ప్రతి మూడు నెలలకోసారి జిల్లాలవారీగా స్కానింగ్ సెంటర్లపై మెరుపుదాడులు జరిపి వారి చర్యలపై నిఘా కొనసాగిస్తోంది.

- సాధారణంగా ఏప్రిల్ నుంచి తదుపరి ఏడాది మార్చి వరకు లింగ నిష్పత్తిని లెక్కిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికం ముగిసింది. ఇప్పటికే శివమొగ్గ జిల్లాలో 1000:972 నిష్పత్తితో ఆడశిశువులు జన్మించి రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచింది. గత ఏడాది 1000:927 నిష్పత్తితో 13వస్థానంలో ఉన్న దావణగెరె జిల్లాలో అత్యధిక మార్పులు సాధ్యమయ్యాయి. 1000:966కు చేరుకోవడం సంతోషకరం. లింగ నిష్పత్తి జాబితాలో బెంగళూరు నగరం చివరగా 31వ స్థానంలో ఉండగా బెంగళూరు గ్రామీణ 30వ స్థానంలో నిలిచింది. బెంగళూరు నగరంలో 1000:882, బెంగళూరు గ్రామీణలో 1000:892గా ఉంది. గదగ్‌లో 898, కలబురగి 900, మైసూరు 900, విజయపుర 902, చిక్కమగళూరు 904, రాయచూరు 906గా ఉన్నాయి.

- 2022-23 సంవత్సరంలో ప్రతి వెయ్యిమందికి 898మంది ఆడశిశువులు ఉండేవారు. 2023-24లో 905కు పెరిగారు. 2024-25లో ప్రస్తుతానికి 914కు చేరగా చివరి త్రైమాసికం ముగిసేసరికి ఎటువంటి పరిస్థితి రానుందో వేచి చూడాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆశాజనకంగా ఉన్న జిల్లాల నిష్పత్తిని పరిశీలిస్తే శివమొగ్గలో అత్యధికంగా 972 మంది, దావణగెరె 966, ఉడుపి 964, రామనగర 957, కోలారు 955గా ఉన్నారు.



పెళ్లిళ్లకు యువతులు లభించడం లేదనే నిరసనలు

కొన్నేళ్లకాలంగా బాలికలసంఖ్య తగ్గుముఖం పడుతూ వచ్చింది. బాలురతో పోలిస్తే బాలికల సంఖ్య రాష్ట్రంలోనే కాకుండా వివిధ రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఇతరత్రా విభాగాలలో సాధారణం అనిపించినా పెళ్లిళ్ల విషయంలో తీవ్ర పరిణామాలు చూపుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే కులాలతో సంబంధం లేకుండా అన్ని సామాజికవర్గాలలోనూ వివాహాలకు యువతులు లభించడం గగనమవుతోంది. బాలబాలికల నిష్పత్తిలో రెండు దశాబ్దాల కింద కొనసాగిన పరిణామం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో పెళ్లిళ్లు జరగడం లేదని బెంగళూరు గ్రామీణ, మండ్య ప్రాంతాలకు చెందిన వందలాదిమంది యువకులు చామరాజనగర జిల్లాలోని మలెమహదేశ్వర ఆలయానికి పాదయాత్ర చేపట్టిన విషయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తమకు పెళ్లిళ్లు కావడం లేదని, ఆడబిడ్డలు పల్లె ప్రాంతాలలో వ్యవసాయ పనులు చేసుకునేవారిపట్ల సుముఖంగా లేరని, 30-40ఏళ్లు దాటుతోందని పాదయాత్ర చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ యువకుడు గ్రామంలో పెళ్లి కాని యువకులు సమావేశం అయ్యేందుకు ఓ కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు జిల్లా అధికారికి వినతినిచ్చారు. దీన్నిబట్టి సమాజంలోని ప్రతిచోటా పెళ్లి కాని యువకులు ఉన్నారనేది స్పష్టమవుతోంది.

దావణగెరెలో యడియూరప్ప జన్మదిన సభ

- విజయేంద్ర వర్గీయుల సమావేశంలో తీర్మానం



సమావేశంలో పాల్గొన్న రవీంద్రనాథ్, రేణుకాచార్య

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అగ్రనేత యడియూరప్ప జన్మదినాన్ని భారీగా జరపాలని తీర్మానించారు. దావణగెరెలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, కీలకనేతలు భేటీ అయ్యారు. దావణగెరెలోని సాయి ఇంటర్నేషనల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత ఎస్ఏ రవీంద్రనాథ్, మాజీ మంత్రి రేణుకాచార్య, హర్తాళ హాలప్ప, కట్టా సుబ్రమణ్యం నాయుడు మాట్లాడారు. ఫిబ్రవరి 27న యడియూరప్ప జన్మదినాన్ని పార్టీలకు అతీతంగా చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిద్దామని తీర్మానించారు. కేంద్రం నుంచి ప్రముఖనేతలతోపాటు వివిధ మఠాధిపతులను ఆహ్వానించదలిచారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతోపాటు ప్రముఖ మఠాధిపతులను ఆహ్వానిస్తామన్నారు. ఇదే తొలి సమావేశమని తదుపరి మరిన్ని కీలక విషయాలు చర్చించనున్నట్టు ప్రకటించారు.

బాళెహొన్నూరు మఠానికి రోబోటిక్ ఏనుగు

- బాలీవుడ్ నటి శిల్పాశెట్టి దంపతుల వితరణ

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు జిల్లా ఎన్ఆర్ పుర తాలూకా భద్రావతి నదీతీరం బాళెహొన్నూరు గ్రామంలోని రంభాపురి మఠానికి బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్త పారిశ్రామికవేత్త రాజ్‌కుంద్రాలు రోబోటిక్ ఏనుగును ఆదివారం బహుమతిగా ఇచ్చారు. ఇది చూసేందుకు సహజసిద్ధమైన ఏనుగులా కనిపిస్తుంది. చెవులు, తల, తొండం, తోకను కదిలిస్తూ ఉంటుంది. బొమ్మగా ఉన్నప్పటికీ నిజమైన ఏనుగు తరహాలో ఉంది. దేశంలోని ఐదు పీఠాలలో రంభాపురి మఠం ప్రథమమైనది. ఈ మఠానికి శిల్పాశెట్టి దంపతులు తరచూ వస్తుంటారు. నిజమైన ఏనుగును మఠానికి ఇచ్చేందుకు సిద్ధమైనా పలు నిబంధనలు ఉన్న మేరకు రోబోటిక్ ఏనుగును విరాళం ఇచ్చారు. మఠంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. భక్తులను ఆశీర్వదించేలా రోబోటిక్ ఏనుగును రూపొందించారు.



రోబోటిక్ ఏనుగుతో భక్తులు

క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే శక్తి పెంచుకోవాలి

- కేఎల్ఈ టెక్ సదస్సులో ఎంపీ సుధామూర్తి



కార్యక్రమంలో ఎంపీ సుధామూర్తి, మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవితానికి ర్యాంకులు ముఖ్యం కాదని విద్యార్థులు వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని, సమాజంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనే శక్తిని పెంచుకోవాలని రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి అన్నారు. నిమ్హాన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో బీవీబీ కేఎల్ఈ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ముఖ్యులుగా పాల్గొన్న సుధామూర్తి మాట్లాడుతూ కేఎల్‌ఈలో ఇంజనీరింగ్ చదివినందున ఇన్ఫోసిస్‌లో నా సేవలు విస్తారం చేసుకునేందుకు ప్రయోజనకరమైందన్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్య అందించవచ్చుని, కానీ విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంపొందించేలా తీర్చాల్సిన విధానం ముఖ్యమన్నారు. ఐఐటీ, ఎన్ఐటీలలోనూ సీట్లు లభించినా మధ్యతరగతి కుటుంబానికి చెందిన నేను అంత డబ్బు ఖర్చు పెట్టలేక ఇక్కడే చదివానన్నారు. నా పుస్తకంలో బీవీబీ కళాశాల పట్ల ఎన్నో అంశాలను ప్రస్తావించానన్నారు. 1972లో కళాశాలలో కొబ్బరిచెట్లు నాటానని గుర్తు చేసుకున్నారు. నేటి పోటీయుగంలో బ్రాండ్ విలువ పెంచడం ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్‌లు కావాలన్నారు. మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి మాట్లాడుతూ భూమారెడ్డి తన కుటుంబాన్ని గురించి ఆలోచించకుండా లక్షలాదిమంది విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని భావించారన్నారు. కేఎల్ఈ టెక్నలాజికల్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ అశోక్ శెట్టర్, అదమ్యచేతన ముఖ్యులు తేజస్విని అనంతకుమార్, రిజిస్ట్రార్ ప్రకాశ్‌తివారి, అలుమిని అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌కరూర్, అశోక్‌లతోపాటు 700మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వ వక్కలిగ మహాసంస్థాన పీఠాధిపతిగా నిశ్చలానందనాథస్వామీజీ

- పలువురు స్వామీజీల సమక్షంలో ధార్మిక కార్యక్రమాలు



మఠాధిపతి నిశ్చలానందనాథ స్వామీజీకి మంగళస్నానం చేయిస్తున్న స్వామీజీలు

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్వ వక్కలిగ మహాసంస్థాన మఠాధిపతిగా నిశ్చలానందనాథస్వామీజీ పీఠాన్ని అలంకరించారు. మైసూరు రోడ్డు కెంగేరిలోని మఠం ఆవరణలో తల్లిదండ్రులతో కలసి త్యాగం, సన్యాసదీక్షతోపాటు పలు ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. శనివారం రాత్రి ప్రారంభమైన ప్రక్రియ ఆదివారం ముగిసింది. రామనగర అదనపు జిల్లా అధికారిగా వ్యవహరిస్తున్న డాక్టర్ హెచ్ఎల్ నాగరాజు ఇటీవలే ఉద్యోగానికి పదవీవిరమణ చేశారు. విశ్వ వక్కలిగ మహాసంస్థాన మఠానికి ఉత్తరాధికారి కావాలని సంఘం పెద్దలు, పీఠాధిపతులు తీర్మానించారు. అందుకు అనుగుణంగానే ప్రక్రియ సాగింది. ఉత్తరాధికారి మహోత్సవంలో ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ మాట్లాడుతూ నిశ్చలానందనాథ పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టే సందర్భంలో భారీస్థాయిలో భక్తులు రావడం సంతోషకరమన్నారు. చంద్రశేఖరనాథ స్వామీజీ నాలుగు దశాబ్దాలపాటు ఉత్తమ సేవలు అందించారన్నారు. వక్కలిగ మహాసంస్థానం ఎంతోకాలంగా కొనసాగుతోందన్నారు. చంద్రశేఖరనాథస్వామీజీ మాట్లాడుతూ నాకు 80 ఏళ్ల వయస్సు వచ్చిందని, ఆరోగ్యం క్షీణిస్తోందని, అందుకు భవిష్యత్తు ఉత్తరాధికారిని నియమించాలనే ఉద్దేశ్యంతో నిశ్చలానందనాథ స్వామీజీగా నాగరాజుకు బాధ్యతలు అప్పగించామన్నారు. మనిషి ఇష్ట దైవాన్ని ప్రార్థించాలని, తల్లిదండ్రులు, పిల్లలను మంచిగా పెంచాలని, ద్వేష అసూయలను వీడాలని, చెడు అలవాట్లు వదులుకోవాలని ఇది ప్రతిమనిషికి మూలమంత్రం కావాలన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నిశ్చలానందనాథ స్వామీజీ మాట్లాడుతూ స్వార్థం వీడి పక్షపాతి కాకుండా అబద్ధాలు చెప్పకుండా ప్రజాసేవ చేయాలన్నారు. నూతన పీఠాధిపతి నిశ్చలానందనాథ స్వామీజీ మాట్లాడుతూ సమాజానికి అంకితమయ్యేందుకు తుమకూరు సిద్ధగంగా మఠం శివకుమారస్వామీజీ, ఆదిచుంచనగిరి స్వామీజీలు స్ఫూర్తి ఇచ్చారన్నారు. వ్యక్తిగతంగా బుద్ధుడు, బసవణ్ణ, మహాత్మాగాంధీజీ, స్వామి వివేకానంద తత్వాలను పాటిస్తానన్నారు. ప్రముఖ రాజకీయనేత దేవెగౌడ ఆశీర్వాదం కూడా లభించిందన్నారు. కార్యక్రమంలో నిడుమామిడి మఠాధిపతి వీరభద్ర చన్నమల్ల దేశికేంద్ర స్వామీజీ బేళి మఠం శివానుభవచరమూర్తి స్వామీజీ, నంజావధూత స్వామిజీ, వినయ్ గురూజీతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఉత్తర కర్ణాటకపై చర్చ ఎప్పుడో..?

- మరో నాలుగు రోజులే కార్యకలాపాలు

బెంగళూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక సమస్యలపై శాసనసభలో మూడు రోజులు, పరిషత్‌లో నాలుగురోజులు చర్చించాలని భావించినా ఆచరణలో సాధ్యమయ్యే పరిస్థితి లేకుండా పోతోంది. ఉత్తర కర్ణాటక సమస్యలపై ఏడాదికోసారైనా సమగ్రంగా చర్చించాలనే కారణంతోనే బెళగావిలో సువర్ణసౌధ ఏర్పాటు చేశారు. తద్వారా వెనుకబడిన ఉత్తర కర్ణాటక జిల్లాల సమస్యలపై స్థానిక శాసనసభ్యులు లేవనెత్తే అంశాలకు మంత్రుల సమాధానంతో పరిష్కారమవుతుందనేది లక్ష్యంగా ఉంది. గడిచిన 12 ఏళ్లుగా శాసనసభ శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. ఏటా ఇక్కడి సమస్యలపై చర్చ ఎలా ఉన్నా ఆందోళనలు మాత్రం తీవ్రస్థాయిలో కొనసాగుతుంటాయి. ఇటు శాసనసభలోనూ, వెలుపలా నిరంతరం నిరసనలు పోరాటాలు సాగుతుంటాయి. ప్రస్తుత శాసనసభ సమావేశాలలో ఉత్తర కర్ణాటక అంశాలపై చర్చ జరగడం అంతంతమాత్రమే అనిపిస్తోంది. ఈనెల 9న శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తర్వాత రెండు రోజులు మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ మృతికి సంతాపంగా కలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత రెండు రోజులు వక్ఫ్‌తోపాటు వివిధ అంశాలపై వివాదాలతోనే ముగిసింది. ఇక సోమవారం నుంచి ఐదు రోజులు శాసనసభ సమావేశాలు జరగాల్సి ఉండేది. కానీ మండ్యలో అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు జరుగనున్న తరుణంలో ఒకరోజు ముందుగా కలాపాలను కుదించారు. దీని ప్రకారం మరో నాలుగు రోజుల్లో సమావేశాలు ముగుస్తాయి. కల్యాణ కర్ణాటక, కిత్తూరు కర్ణాటక జిల్లాల్లో ఎన్నో సమస్యలపై చర్చలు జరగాల్సి ఉన్నా అవకాశం లేదనిపిస్తోంది. సజావుగా నాలుగు రోజులు కలాపాలు కొనసాగితే ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ ముగిశాక ఉత్తర కర్ణాటక అంశాలపై చర్చకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. అయితే వక్ఫ్ వివాదాన్ని ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా పరిగణిస్తోంది. తాజాగా మంత్రి ప్రియాంకఖర్గే వక్ఫ్ ఆస్తులపై నివేదిక తయారు చేసిన వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అన్వర్ మానప్పాడికి ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర 150 కోట్లరూపాయలు ఇవ్వచూపారని ఆరోపించారు. ఈ వివాదంపై సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలని సీఎం సిద్దరామయ్య డిమాండ్ చేశారు. అయితే అటువంటి వివాదం జరగలేదని అన్వర్ మానప్పాడి తెలిపారు. ఇదే అంశంపై ఉభయసభలలో చర్చలు కొనసాగే అవకాశం ఉంది. మరోవైపు పంచమశాలి లింగాయతల నిరసన వేళ లాఠీచార్జ్ చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా పంచమశాలిలు నిరసన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తప్పుడు కేసులను ఉపసంహరించాలని, ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై ప్రతిపక్షాలతోపాటు పంచమశాలి లింగాయత శాసనసభ్యులు ఆందోళన కొనసాగించే అవకాశం ఉంది.

న్యూస్ బాక్స్

బాలీవుడ్ సింగర్‌పై ఎఫ్ఐఆర్‌కు బ్రేక్

బెంగళూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భూ వివాదానికి సంబంధించి బాలీవుడ్ గాయకుడు లక్కీ అలికి వ్యతిరేకంగా ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి కుటుంబీకులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌కు రాష్ట్ర హైకోర్టు బ్రేక్ వేసింది. బెంగళూరు శివారులోని కెంచేనహళ్ళిలో ఉన్న భూమిలో అక్రమంగా ప్రవేశించి ప్రహరీ, చెట్లను ధ్వంసం చేశారని రోహిణిసింధూరి అత్త బుజ్జమ్మ యలహంక న్యూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయకుడు లక్కీ అలి అలియాస్ మక్సూద్ అలిపై ఈ మేరకు ఎఫ్ఐఆర్ దాఖలైంది. గాయకుడు లక్కీ అలి, మైలప్పనహళ్ళి శ్రీనివాస్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు న్యాయమూర్తి ఎం నాగప్రసన్న ధర్మాసనం ఎఫ్ఐఆర్‌కు బ్రేక్ వేసింది. తదుపరి ఎటువంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకున్నట్టయ్యింది. రోహిణి సింధూరి ఐఏఎస్ అధికారిగా వ్యవహరిస్తున్నారని, పలుకుబడితో పోలీసుల ద్వారా వేధింపులకు గురి చేస్తున్నారని లక్కీ అలి తరపు న్యాయవాదులు వాదించారు. కెంచేనహళ్ళిలో నటుడు, గాయకుడు లక్కీ అలికు సంబంధించిన ట్రస్టు పేరిట 87 ఎకరాల భూమి ఉంది. ఇదే భూమి పక్కన ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి భర్త సుధీర్‌రెడ్డి భూమి కొనుగోలు చేశారు. సదరు భూమిని లక్కీఅలి సోదరుడి నుంచి కొనుగోలు చేసినట్టు సుధీర్‌రెడ్డి చెబుతున్నారు. 2016 నుంచి సుధీర్‌రెడ్డి, లక్కీఅలిల మధ్య సివిల్ వివాదం కొనసాగుతోంది.

దర్శన్ బెంగళూరు వీడరాదు



బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో ఆరు నెలలపాటు రిమాండ్ ఖైదీగా కొనసాగిన నటుడు దర్శన్‌కు ఎట్టకేలకు బెయిల్ దక్కింది. అయితే దర్శన్‌కు పలు నిబంధనలు వర్తించనున్నాయి. ఇతర రాష్ట్రాలు, విదేశాలకు షూటింగ్‌కు వెళ్లరాదు. శుక్రవారం దర్శన్‌కు బెయిల్ మంజూరైంది. బెంగళూరు సెషన్స్ కోర్టు పరిధి దాటి వెళ్ల కూడదనే నిబంధనలు ఉన్నాయి. ఈ నిబంధనలు రేణుకాస్వామి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పవిత్రగౌడతోపాటు నిందితులందరికీ వర్తిస్తాయి. ఒకవేళ హైకోర్టు నిబంధనలు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు అయ్యే అవకాశాలు ఉన్నాయి. దర్శన్‌కు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు ఆరు షరతులు విధించింది. లక్ష రూపాయల బాండు, ఇద్దరి పూచీకత్తు తప్పనిసరిగా ఇవ్వాలి. కోర్టు విచారణకు హాజరు కావాలి. సాక్షులను బెదరించరాదు. ఎలాంటి నేరపూరితమైన చర్యలలో భాగస్వాములు కారాదు. కోర్టు అనుమతి లేకుండా సెషన్స్ కోర్టు పరిధి దాటరాదు. ప్రస్తుతం బెయిల్ పొందినవారిలో పవిత్రగౌడతోపాటు దర్శన్, ఆర్ నాగరాజు, ఎం లక్ష్మణ్, అనుకుమార్, జగదీశ్, ప్రదోష్ ఎస్ రావ్ ఉన్నారు. హత్య కేసులో 17మంది ఆరోపితులు ఉండగా ఇప్పటివరకు 12మందికి బెయిల్ లభించింది. జైలులో ఉన్నవారిలో పుట్టస్వామి అలియాస్ పవన్, రాఘవేంద్ర, నందీశ్, ధనరాజ్ అలియాస్ రాజు, వినయ్‌లకు బెయిల్ లభించాల్సి ఉంది.


బెయిల్‌పై సుప్రీంలో పిటిషన్: రేణుకాస్వామి హత్య కేసులో ఏడుగురు ఆరోపితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు ప్రాసిక్యూషన్ సిద్ధమవుతోంది. ఇదే విషయమై నగర పోలీస్ కమిషనర్ దయానంద్ మీడియాతో మాట్లాడుతూ కోర్టు తీర్పు కాపీ ఇంకా చేతికి అందలేదన్నారు. తీర్పు కాపీ లభించిన వెంటనే తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే అంశంపై న్యాయవాదులతో చర్చిస్తామన్నారు.

కొడుకును చెరువులో విసిరేసిన తల్లి..



నిందితురాలిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు, చిన్నారిని విసిరేసిన చెరువు

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కన్నపేగు అని చూడకుండా రెండేళ్ళ కొడుకును ఓ తల్లి చెరువులో విసిరేసిన ఘటన బెళగావి నగరంలో ఆదివారం చోటు చేసుకుంది. నగరశివారు ప్రాంతంలోని కణబర్గి చెరువులో రెండేళ్ళ కుమారుడిని చెరువులో విసిరేసి చంపే ఆమె ప్రయత్నం చేసింది. ఇది చూసిన పశువుల కాపరి వెంటనే చెరువులో దూకి చిన్నారిని కాపాడడంతో ప్రాణాపాయం నుంచి బయట పడింది. విషయం పోలీసులకు తెలియడంతో అఘాయిత్యానికి పాల్పడిన శాంతా రాబర్ట్ అనే మహిళను అరెస్టు చేశారు. చిన్నారికి ఫిట్స్ వస్తున్నట్లు, ఎంత చికిత్స చేయించినా నయం కావడం లేదని, ఇంట్లో చూసుకోవడానికి ఎవరూ లేని కారణంగా విసుగు చెంది చెరువులో విసిరేసినట్లు ఆమె పోలీసుల విచారణలో తెలిపినట్లు బెళగావి నగర అసిస్టెంట్ పోలీసు కమిషనర్ రోహన్ జగదీష్ తెలిపారు. ఈ మేరకు మాళమారతి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.18	1,591.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,122	262
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,961	1,470
నీటి నిల్వ (టీఎంసీలు)	91.01	11.77

రబీ సాగుకు అన్నదాత సిద్ధం



కళకళలాడుతున్న వరి నారుమళ్లు

బళ్లారి సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వర్షాలు బాగా కురిసి ఖరీఫ్ పంటలు సమృద్ధిగా పండటంతో రబీ సాగుకు జిల్లాలో వరి నారు సిద్ధం చేస్తున్నారు. పదిరోజుల మేఘాలు కమ్ముకోవడం, చిరు జల్లులు పడుంటంతో నారుమళ్లు పచ్చదనంతో నిగనిగలాడుతున్నాయి. జిల్లాలోని సిరుగుప్ప సోనామసూరికి పేరెన్నికగన్నది. సోనమసూరికి దేశ విదేశాలలో బలే గిరాకీ ఉంది. ఈసం వత్సరం ఖరీఫ్‌లో ఆర్‌ఎన్‌ఆర్ రకం అధికశాతంలో పండించగా సోనమసూరి తక్కువగా పండించారు. రైతులు ఆర్‌ఎన్‌ఆర్ పంటలు ఎక్కువగా పండించినా అకాల వర్షాలకు వరి నేలకొరిగి కొంత మంది రైతులు నష్టపోయారు. దీంతో ఈసారి వేసవి పంటకు ఎక్కువ మంది రైతులు సోనమసూరికి ప్రాధాన్యం ఇస్తున్నారు. గత ఏడాది తుంగభద్రజలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో రైతులు వేసవి పంట వేసేందుకు ఆలోచించారు. ఈ ఏడాది జలాశయంలో నీటి లభ్యత సమృద్ధిగా ఉండటంతో తుంగభద్ర ఆయకట్టు కింద రైతులు అధిక శాతంలో సోనమసూరి రకం నారు వేసి నాటుకు సిద్ధంగా ఉన్నారు.

కలకలం రేపిన బాలింత మరణం..!



ఈశ్వరి (ఫైల్)

రాయచూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో బాలింతలు మరణించడం ఒకవైపు చర్చనీయంశమైన నేపథ్యంలో జిల్లాలోనూ అలాంటి ఘటనే చోటు చేసుకుంది. రాయచూరు తాలూకా గారలదిన్నికి చెందిన ఈశ్వరి(32) బాలింత రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈమె పురిటి నొప్పులు వస్తున్న సమయంలో మటమారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడే వైద్యులు ప్రసవం జరిపారు. మూడు రోజులకు ఈమెను ఇంటికి పంపగా అదేరోజు రక్తస్రావం జరిగి తీవ్ర జ్వరం రావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆమెను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే ఆమె మృత్యువాతపడింది. మటమారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈశ్వరి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

కోరిక తీర్చలేదని కోడలిని హత్యచేసిన మామ



దుళ్ళమ్మ (ఫైల్)



రామలింగయ్య (ఫైల్)

రాయచూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోడలి పట్ల అసభ్యంగా ప్రవర్తించి తన కోరిక తీర్చలేదన్న ఆక్రోశంతో ఆమెను మామ హత్య చేసిన ఘటన ఆదివారం రాయచూరు తాలూకాలోని జులంగేరాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామలింగయ్య తన కోడలు దుళ్ళమ్మ(27)ను బలాత్కరించే ప్రయత్నం చేయగా ఆమె కేకలు వేస్తూ తప్పించుకుని ఇంటి నుంచి బయటికి వచ్చే ప్రయత్నంలో ఉండగా ఇంట్లో నుంచి మామ ఆమెపై కడ్డీ విసరగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. నిందితుడు రామలింగయ్య గతంలోనూ కోడలిపై అత్యచారయత్నం జరపగా గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని మందలించి కొడుకు, తండ్రి మధ్య రాజీ కుదుర్చారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మరోసారి కోడలిపై అత్యాచారం చేసేందుకు యత్నించిన రామలింగయ్య ఆమె లొంగకపోవడంతో హత్య చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విషయాన్ని పోలీసులకు తెలపగా ఇడపనూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోలీసులు వచ్చేలోగా నిందితుడు పరారైనట్లు గ్రామస్థులు తెలిపారు.

సహజ వనరుల పరిరక్షణ అందరి బాధ్యత

● ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శశిధర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇంజనీర్స్ అసోసియేషన్ ధ్యక్షుడు శశిధర్

బళ్లారి సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సహజ వనరుల పరిరక్షణ అందరి బాధ్యత అని మునీరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శశిధర్ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ సెంటర్ మునిరాబాద్, బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవానికి ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఉపయోగించే ప్రాథమిక శక్తి వనరు, శిలాజ ఇంధనాలు, బొగ్గు, సహజవాయువు తదితర వాటి నుంచి వస్తాయన్నారు. ఇది ఏర్పడటానికి మిలియన్ల సంవత్సరాలు పడుతుందని, అవి ఆధునీకరించలేదన్నారు. అందువల్ల సౌరశక్తి, పవనశక్తి, జలశక్తి, భూ ఉష్ణశక్తి, బయోమాస్ శక్తి తదితర పునరుత్పాదక వనరుల నుంచి మనం శక్తిని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దైనందిన జీవితంలో చిన్న చిన్న మార్పులను అవలంబించడం ద్వారా ప్రపంచంలో పెద్ద మార్పు తీసుకురావచ్చన్నారు. లైట్లు,ఫ్యాన్లు, ఎయిర్ కండీషనర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల అనవసర వినియోగాన్ని నివారించాలన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ఇంధనాన్ని సమర్థవంతంగా ఉపయోగించడం, పొదుపు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బీఐటీఎం ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్, మునీరాబాద్ ఇన్‌స్టిట్యూట్ గౌరవ కార్యదర్శి శరత్‌కుమార్, వెంకటరమణ, శరణ్‌రెడ్డి, మణికంఠ, నాగరాజ్, ఈరయ్య షికేరిమఠ్, 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఇంధన వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన రెన్యూవబుల్ ఎనర్జీ క్లబ్‌ను ప్రారంభించారు.

కల్వర్టుకు మోక్షం



ఎక్స్‌కవేటర్ సాయంతో ఇనుప గ్రిల్‌ను అమరుస్తున్న దృశ్యం

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పరిధిలోకి సత్యనారాయణ అండర్ పాస్ మీదుగా ఉమెన్స్ కళాశాల వెళ్లే రోడ్డులో శిథిలావస్థకు చేరుకున్న మెటల్ కల్వర్టు ప్రమాదంగా మారిన నేపథ్యంలో ఆదివారం కార్పొరేషన్ ఇంజనీర్లు మరమ్మతులు చేపట్టారు. దీనిపై ఆదివారం 'పడిపోతున్నా పట్టించుకోరా' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్పొరేషన్ ఎట్టకేలకు స్పందించింది. ఆదివారం ఉదయం క్రేన్ సహాయంతో మెటల్ కల్వర్టును తొలగించి మరమ్మతులు చేపట్టారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ రూపనగుడి సొసైటీ ఎన్నికలు



ఓటు వేస్తున్న సహకార సంఘం సభ్యులు



పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల పహారా

బళ్లారిరూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని రూపనగుడి సొసైటీ ఎన్నికలను కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించారు. రాయపురం, రూపనగుడి, కుంటనహాళ్, లింగదేవనహళ్లి, వై కగ్గల్లు గ్రామాలకు సొసైటీ ఎన్నికలు జరిగాయి. రూపనగుడిలోని కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలకు పీడీ హళ్లి ఎస్‌ఐ నాగభూషణ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోటాపోటీగా సహకార సంఘం ఎన్నికలు

కంప్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని శ్రీరామరంగాపురం (సుగ్గినళ్లి కొట్టాల్) కృషి పత్తిన సహకార సంఘం సభ్యుల ఎన్నికలు పోటాపోటీగా సాగాయి. 12 మంది సభ్యులు ఉండగా, ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మావినళ్లి ఎంగోపాల్, వన్నళ్లి రాజాసాబ్, సుగ్గినళ్లి వీ గోవిందప్ప ఎన్నికయ్యారు. మిగతా తొమ్మిది మంది సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. పోటీల్లో శ్రీరామరంగాపురానికి చెందిన సభ్యులే ఎన్నికయ్యారు. చిన్న హనుమంతు, జయచంద్ర, శ్రీనివాసులు, విజయలక్ష్మి, చంద్రకళ, వెంకటనారాయణ, యల్లప్ప, వెంకటరమణ, నారాయణ స్వామి విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి హనుమంతు తెలిపారు. సహకార సంఘం వన్నళ్లి, మావినళ్లి, సుగ్గినళ్లి, శ్రీరామరంగాపురం గ్రామాలకు చెందింది. గెలుపొందిన సభ్యులను పలువురు అభినందించారు. కార్యదర్శి రమేష్, నాలుగు గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.



శ్రీనివాసులు



చిన్న హనుమంతు



విజయలక్ష్మి



వెంకటరమణ



డి. వెంకటరమణ



యల్లప్ప



నారాయణస్వామి



చంద్రకళ



జయచంద్ర

ఒకప్పుడు దేవదాసీలు మాత్రమే బయలాట ఆడేవారు

● అధ్యాపకురాలు పూర్ణిమ



మాట్లాడుతున్న అధ్యాపకురాలు పూర్ణిమ

బళ్లారి సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గతంలో దేవదాసీ మహిళలు మాత్రమే బయలాట ఆడేవారని, ప్రస్తుతం అందరూ ఆడుతున్నారని నంది పాఠశాల అధ్యాపకురాలు పూర్ణిమ అన్నారు. నగరంలో రెండు రోజుల పాటు దొడ్డనగౌడ రంగమందిరంలో బయలాట అకాడమీ, కన్నడ సాహిత్యపరిషత్ కన్నడ-ఆంధ్రప్రదేశ్‌లోని బయలాట సెమినార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కన్నడ బయలాట మహిళలు అనే అంశాన్ని గురించి ఆదివారం జరిగిన కార్యక్రమంలో పూర్ణిమ వివరించారు. కన్నడ, తెలుగు భాషల సాంస్కృతిక సమారస్యం కొనసాగుతోందన్నారు. రాజకీయంగా కన్నడ, తెలుగు మాట్లాడేవారి మధ్య పోటీ నెలకొంది కానీ, సాంస్కృతిక రంగంలో అది ప్రతిఫలించలేదన్నారు. స్త్రీలను గౌరవప్రదమైన స్థానంలో ఉంచినా వారు రాజకీయంగా, సామాజికంగా దూరంగా ఉంచడం బాధాకరమన్నారు. పురుషులచే నాటకాలు, బహిరంగ ప్రదర్శనలు నేటికి నిర్వహిస్తున్నారు. స్త్రీలు రాజులు, మహారాజుల కోసం మాత్రమే నృత్యాలు చేసేవారని, అనంతరం మహిళలు కూడా పాత్రలలో కనిపిస్తున్నారన్నారు. బళ్లారికి చెందిన నరసుబాయి తొలిసారిగా స్త్రీపాత్ర పోషించారని గుర్తుచేశారు. బయలాట పౌరాణిక, కథలలో ద్రౌపది, గాంధారీ, ఉత్తర, కనకాంగి, భానుమతి, సీత తదితర పాత్రలు మహిళలు పోషించారన్నారు. చాలా మంది వృత్తి రీత్య మహిళా నటుల పరిస్థితి ఆర్థికంగా బాగోలేదని, మాషాసన్ ద్వారా వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బయలాట రచయితకూడ్లిగికి చెందిన అరుణ్ మాట్లాడుతూ కళాకారుల పరిస్థితి, దృక్పథం గురించి వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆర్థిక పరిస్థితి, కళాకారుల పరిస్థితి బాగాలేదన్నారు. బయలాట కళాకారుల ఆర్థిక పరిస్థితి ఇంకా దయనీయంగా ఉందన్నారు. సెమినార్‌లో అంశాన్ని పరదర్శించడం ద్వారా అనేక అంశాలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నించాయి. అయితే దీన్ని వినే మనసు, ఆసక్తి ఉన్నవారి లోటు స్పష్టంగా కనిపించింది. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అకాడమీలు చాలా డబ్బు ఖర్చు చేయగలవు, కానీ ప్రభావం తక్కువగా ఉంటుందన్నారు. శిక్షణ శిబిరాల ద్వారా నేటి తరానికి కళను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బయలాట అకాడమీ అధ్యక్షుడు దుర్గాదాస్, సభ్యురాలు చేతన, దేవేంద్రప్ప పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠిస్తున్న శివాజీ స్వాములు

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కంప్లి, డిసెంబరు 15(ఆంధ్ర జ్యోతి): తాలుకాలోని బసవేశ్వర క్యాంపులో శివరామకృష్ణ శర్మ స్వాముల ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం హోమాలు, అష్టోత్తరం, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, మంగళహారతి, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టారు. గో ప్రదర్శన అనంతరం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్ర, శని ఆదివారాలు మూడు రోజుల పాటు క్యాంపుల్లో పండుగ వేడుకలు జరుపుకున్నారు. అరేశ్రీనివాస కోలాట భజన బృందం అందరినీ ఆకట్టుకుంది. కంప్లి, బళ్లారి, సిరుగుప్ప, గంగావతి, హోస్పేట, ఇతర రాష్ట్రాల నుంచి భారీఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

కనులపండువగా లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణం





అలంకరణలో స్వామి, అమ్మవార్లు, రథాన్ని లాగుతున్న భక్తులు

కంప్లి, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని వెంకటరమణ ఆలయంలో లక్ష్మీ వెంకటేశ్వరస్వాముల కల్యాణం పరమహంస నారాయణ విద్యా భారతి స్వాముల ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. 41వ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 10 నుంచి 16వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదివారం స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మహాభిషేకం, శ్రీలక్ష్మీ నారాయణ హోమం చేపట్టారు. అనంతరం స్వామివారి రథాన్ని మాడవీధుల్లో ఊరేగించారు.

వైభవంగా రథోత్సవం



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

సిరుగుప్ప, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేటె ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణంలో దేశనూరు రోడ్డుమార్గంలో వెలసిన పురాతన ఆలయం పేటె ఆంజనేయస్వామి ఆలయంలో రథోత్సవం సందర్భంగా భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రధానఅర్చకులు శ్యామాచార్య స్వాములవారికి పుష్పాలంకార సేవలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి



అలంకరణలో దత్తాత్రేయ స్వామి

బళ్లారి సిటీ, డి సెంబరు 15(ఆంధ్ర జ్యోతి): నగరంలోని స్థానిక దత్తసాయి గురు దత్తాత్రేయ ఆలయంలో ఆదివారం దత్త జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, ఫలపంచామృత అభిషేకం, అనంతరం సత్యనారాయణస్వామి పూజ, హోమం చేపట్టారు. అన్నదాసోహ నిర్వహించారు. సాయంత్రం దత్తాత్రేయ స్వామి ఉత్సవమూర్తికి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఘనంగా మాదార చన్నయ్య జయంత్యుత్సవం



మాదార చన్నయ్య శిలాఫలకం వద్ద నివాళి అర్పిస్తున్న సమాజ నేతలు

రాయచూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహా శరణుడిగా ఖ్యాతిగాంచిన మాదార చన్నయ్య జయంతిని ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళా సమాజ్ ఆవరణలో ప్రధాన కార్యక్రమానికి పూర్వం అశోక్ డిపో సమీపంలో దివంగత మహా శరణుడు మాదార చన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి సమాజ ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం నగరంలో చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

● రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

రాయచూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సర్వోతోముఖాభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించడం తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్డు, డ్రైనేజీ తదితర కనీస సౌకర్యాల కల్పనకు తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. తాలూకాలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో రూ.1.75 కోట్ల అంచన వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామంలోని కనకదాస సర్కిల్ నుంచి మరడి గంగాధర దేవాలయం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. మరడి గంగాధర స్వామి దేవాలయానికి జిల్లా నలమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యం కోసం రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

హోసూరు జోన్

రైతుపై ఏనుగు దాడి

హోసూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని సానమావు అడవులో బస చేసిన ఏనుగుల గుంపు నుంచి ఒక ఏనుగు విడిపోయింది. కొత్తపల్లి గ్రామంలోని వ్యవసాయ భూముల్లోకి ప్రవేశించి పంటలను నాశనం చేసింది. శనివారం రాత్రి ఒంటరి ఏనుగును సానమావు అడవుల్లోకి తరిమికొట్టారు. అయినా ఆదివారం ఉదయం డి.కొత్తపల్లిలో ఒంటరి ఏనుగు తిరిగి వచ్చి పంటలను నాశనం చేస్తోంది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఎంగప్ప(50) అనే రైతు ఏనుగు అతనిపై దాడి చేయడంతో త్రీవంగా గాయపడ్డాడు. అనంతరం చుట్టుపక్కల పొలాల రైతులు ఎంగప్పను రక్షించి చికిత్స నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు స్పందించి ఒంటరి ఏనుగును గుర్తించి సానమావు అడవుల్లోకి తరిమారు. ప్రస్తుతం ఏనుగు సంచారంతో సానమావు, బీర్జేపల్లి, సినిగిరిపల్లి, రామాపురం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరికలు జారీ చేసింది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు ఎంగప్ప

నీటి సమస్య పరిష్కారం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య

హోసూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని ఆరో వార్డు కేసీసీ నగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. కౌన్సిలర్ మమత సంతోశ్ సమస్యను మేయర్ సత్యకు వివరించగా కార్పొరేషన్ ద్వారా చర్యలు చేపట్టారు. బోరు బావి తవ్వించి విద్యుత్ మోటారు సదుపాయం కల్పించారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్ హాజరై మోటారును ఆన్ చేసి నీటి పంపిణీని ప్రారంభించారు. మేయర్ సత్య, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, హోసూరు ఒకటో జోన్ రవి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. చాలాకాలంగా ఉన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంపై ప్రభుత్వానికి, నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్‌కు అభినందన



డాక్టర్ నందినిని సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ పదాధికారులు

హోసూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు ఈఎస్‌ఐ ప్రభుత్వ ఆసుపత్రిలో 29 ఏళ్ల పాటు సేవలందించిన డాక్టర్ నందిని అసోసియేట్ డైరెక్టర్ (హెల్త్ సర్వీసెస్) గా పదోన్నతి పొందారు. సేలం జిల్లాకు పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో డాక్టర్ నందినిని ఐఎన్‌టీయూసీ పదాధికారులు స్వయంగా భేటీ అయి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజు, కోశాధికారి పరమానంద ప్రసాద్, ఈఎస్‌ఐ ఇన్‌చార్జ్ సంయుక్త కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యక్షుడు భక్తవత్సలం, ఆటో రమేశ్ పాల్గొని సత్కరించారు.

నగరేశ్వర స్వామికి విశేష పూజలు

హోసూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హోసూరు నేతాజీ రోడ్డులో వెలసిన పార్వతీ నగరేశ్వర ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమిని పురస్కరించుకుని లోక కల్యాణర్థం కోసం పూజలు నిర్వహిస్తారు. అర్చకులు ప్రదీప్‌శర్మ సత్యనారాయణ స్వామి వ్రత కథలను భక్తాదులకు వివరించారు. పూజల్లో పాల్గొన్న భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గుంతలను పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

హోసూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హోసూరు బస్‌స్టేషన్, బాగలూరు రహదారి మార్గం గుంతలమయం కావడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గాన్ని బాగు చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు చొరవ చూపారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్డు గుంతలపై సిమెంటు మిశ్రమం, కంకరరాళ్లు వేసి తాత్కాలికంగా పూడ్చివేశారు. హోసూరు ట్రాఫిక్ పోలీసులు తిరుణావుకరస్సు, ట్రాఫిక్ వార్డెన్ గణపతి తదితరులు కార్యాచరణలో పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసుల కార్యవైఖరిపై ప్రశంసలు వ్యక్తం అయ్యాయి.



గుంతలను పూడ్చివేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఉప్పులూరి గణపతిశాస్త్రి (జయంతి)



ప్రముఖ వేదపండితుడు ఉప్పులూరి గణపతిశాస్త్రి 1888 డిసెంబరు 16న తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జన్మించారు. వేదశాస్త్రాల పరిరక్షణకు వేద సారాన్ని ప్రచారం చేయడంలో ప్రముఖపాత్ర పోషించారు. టీటీడీ ఆస్థాన వేద పండితుడిగా వ్యవహరించారు. టీటీడీ ఈఓగా పీవీఆర్‌కే ఉన్నవేళ నీటి ఎద్దడి నెలకొన్నప్పుడు గణపతి శాస్త్రి ఆధ్వర్యంలో వరుణయాగం నిర్వహించడంతో తిరుమలలో వర్షం కురిసింది. వేదభాష్య విశారద, వేదభాష్యాలంకార, సాంగ వేదార్థ వాచస్పతి, వేదభాషాచార్య, ఆమ్నాయ సరస్వతి, కళాసరస్వతి అనే బిరుదులు పొందారు. 1985లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1989 జూలై 17న భౌతిక కాయాన్ని త్యజించారు.

యడ్లపాటి వెంకట్రావు (జయంతి)



యడ్లపాటి వెంకట్రావు 1919 డిసెంబరు 16న గుంటూరు జిల్లా అమృతలూరు మండలం బోడపాడు గ్రామంలో జన్మించారు. సీనియర్ రాజకీయ నాయకులు, రాజ్యసభ, శాసనసభలలో సభ్యులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రిగా విశేషమైన సేవలందించిన రైతు నాయకుడు. సంగం డెయిరీకి ఆయన వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగారు. రైతు నాయకుడు ఎన్‌జీ రంగా ముఖ్య అనుచరుడిగా అడుగులు వేశారు. నిస్వార్థ రాజకీయనేతగా, రైతు నాయకుడిగా నిండు నూరేళ్లు జీవించారు. 2022 ఫిబ్రవరి 28న కన్నుమూశారు.

బోయి భీమన్న (వర్ధంతి)



పద్మభూషణ్ గ్రహీత బోయి భీమన్న 1911 సెప్టెంబరు 19న తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. ప్రముఖ రచయితగా సామాజిక చైతన్యంతో 70 పుస్తకాలు రచించారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాలు రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, కళాప్రపూర్ణ, గౌరవ డాక్టరేట్ ఇతర గౌరవాలు అందుకున్నారు. 2005 డిసెంబరు 16న తుదిశ్వాస వీడారు.

హెచ్‌డీ కుమారస్వామి (పుట్టినరోజు)



కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి 1959 డిసెంబరు 16న హాసన్ జిల్లా హొళెనరసీపుర తాలూకా హరదనహళ్లిలో జన్మించారు. మూడు సార్లు లోక్‌సభ సభ్యుడిగా, ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుసార్లు కర్ణాటక ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కాగా శాండల్‌వుడ్‌లో సినీ నిర్మాతగా కొన్ని సినిమాలను రూపొందించి పేరొందారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

రాయచూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి అందించే రక్తదానం ప్రాణదానంతో సమానమని రోటరీ క్లబ్ చైర్మన్ ఏజీ రంగలింగన గౌడ అన్నారు. రోటరీ క్లబ్, జనసేన ప్రతిష్ఠాన్ బ్లడ్ కేంద్రం, దృష్టి ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని తాయమ్మ దేవి ఆలయంవద్ద ఉచిత నేత్ర చికిత్స శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని రంగలింగన గౌడ ప్రారంభించి మాట్లాడారు. సామాజిక కార్యక్రమాల్లో యువతీయువకులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. శిబిరంలో పాల్గొన్న 30 మంది యువకులు రక్తాన్ని దానం చేశారు.

సీమ ఉద్యమంలో కవుల పాత్ర కీలకం

మహాకవి సమ్మేళనంలో బొజ్జా దశరథరామిరెడ్డి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఉద్యమ వికాసంలో కవుల పాత్ర కీలకం అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ మహా కవిసమ్మేళనానికి బొజ్జా దశరథరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కవులు తమ కవితాగానం వినిపించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ... అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాలో కీలకమైన హంద్రీనీవా కాలువల నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ.. సమైక్యాంధ్ర మత్తులో తరతరాలుగా రాయలసీమ మోసపోతూనే ఉందని, సీమ సాహిత్య రంగంలో మరింత చలనం రావాలని కోరారు. సీనియర్ రచయిత శాంతినారాయణ మాట్లాడుతూ.. సీమ జీవితంలోని సంక్లిష్టతలను కవులు, రచయితలు మరింత పదునుగా రికార్డు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కవి డాక్టర్ పామిరెడ్డి దామోదరరెడ్డి తన కవితాగానం వినిపించారు. అనంతరం 'సద్ద కంకి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులందరికీ ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక అరుణ్, రత్నం, మానవత అమరనాథరెడ్డి, లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మల్లెల నరసింహమూర్తి, రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ఏలూరు యంగన్న, నబీరసూల్, సడ్లపల్లి చిదంబరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవి దామోదరరెడ్డికి ప్రశంసాపత్రం అందిస్తున్న సాహితీకారులు

ప్రాణాలు నిలబెట్టే రక్తదానం గొప్పది

దొడ్డబళ్లాపుర, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అన్నిదానాలలోకి మరొకరి ప్రాణాలు నిలబెట్టే రక్తదానం ఎంతో గొప్పదని లయన్స్ జిల్లా 317 ఎఫ్ రక్తనిధి కన్వీనర్ చిన్నప్ప థామస్ అభిప్రాయపడ్డారు. స్థానిక లయన్స్‌క్లబ్ ఆఫ్ దొడ్డబళ్లాపుర, ఆర్‌ఎల్ జాలప్ప ఇన్‌స్టిట్యూషన్స్, ఆర్‌ఎల్ జాలప్ప గ్రూప్ విద్యాసంస్థల నేతృత్వంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్‌ఎల్ జాలప్ప సాంకేతిక విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ విభాగం సభాంగణం, దేవరాజ్ అరసు అంతర్జాతీయ వసతి పాఠశాల సభాంగణంలో శిబిరాలు నిర్వహిం చారు. శిబిరాన్ని థామస్ ప్రారంభించి మాట్లాడుతూ సాంకేతికంగా ఎంతో ప్రగతి సాధించినా రక్తాన్ని కృత్రిమంగా సాధించడం సాధ్యం కాలేదన్నారు. ఇటీవలి కాలంలో తరచూ ప్రమాదాలతో గాయపడేవారు అధికమయ్యారని విచారం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో రక్తం ఆవశ్యకత మరింత పెరిగిందన్నారు. లయన్స్ సంస్థ దీపక్ సుమన్, లయన్స్ జీఈటీ కన్వీనర్ ఎంఆర్ శ్రీనివాస్, ఆర్‌ఎల్ జాలప్ప లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జేఆర్ రాకేశ్, మధుమేహ విభాగం జిల్లా కన్వీనర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

ఆరోగ్యం అందరి హక్కు

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం అందరి హక్కు అని ఎవరికి వారు కాపాడుకోవాల్సిందేనని ప్రముఖ నటుడు డాలీ ధనంజయ అభిప్రాయపడ్డారు. అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో 18వ విడత సమర్థనం ట్రస్టు ఆధ్వర్యంలో వాకథాన్‌ను శనివారం నిర్వహించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జయనగర కిత్తూరు రాణి చన్నమ్మ మైదానంలో ప్రారంభించారు. జయనగర ఎమ్మెల్యే సీకే రామమూర్తి, ఓపెన్ టెక్స్ ఇండియా ఎండీ మనోజ్ నాగ్‌పాల్, సమర్థనం ట్రస్టు వ్యవస్థాపకులు మహంతేశ్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. సుమారు 10వేలమంది ఔత్సాహికులు వాకథాన్‌లో పాల్గొన్నట్టు ప్రకటించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు గురుప్రసాద్, బ్లూ ఎండర్ ప్రాక్టీస్ డైరెక్టర్ సతీశ్ కుమార్‌తోపాటు వివిధ కంపెనీల ముఖ్యులు భాగస్వామ్యులయ్యారు. సౌత్ ఎండ్ సర్కిల్ మీదుగా లాల్‌బాగ్ వెస్ట్‌గేట్, బసవనగుడి దాకా వాకథాన్ సాగింది.



వాకథాన్ ప్రారంభంలో డాలీ ధనంజయ, ఎమ్మెల్యే రామమూర్తి తదితరులు


ఉత్సాహంగా 3కే శారీరన్

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో ఆరోగ్యంపట్ల ఆసక్తి పెంచేలా ఆదివారం ప్రత్యేకంగా శారీరన్ నిర్వహించారు. నగరంలోని హోసూరు రోడ్డులోగల డెకథ్లాన్ సంస్థ, మదర్‌హుడ్ ఆసుపత్రి సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. స్థానిక మహిళలు 250మందికిపైగా పాల్గొన్నారు. ఇటీవలికాలంలో శారీరక శ్రమ తగ్గడంతో తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వక్తలు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రోజూ కొద్దిసేపు నడకకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదే సందర్భంగా కొంతమంది వైద్యులు కూడా పాల్గొని చక్కటి ఆరోగ్యం కోసం పాటించాల్సిన కనీస విధానాలపై అవగాహన కల్పించారు. మదర్‌హుడ్ హాస్పిటల్ డాక్టర్ దీపమాలా మాట్లాడుతూ పీరియడ్స్‌లో వచ్చే కడుపునొప్పి గురించి నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఉపశమనం సాధ్యమన్నారు. అలాగే ఇటీవలికాలంలో అధికమవుతున్న గర్భకోశ కేన్సర్‌ను ప్రారంభంలోనే గుర్తిస్తే చికిత్స, నివారణ సులభతరం అవుతుందన్నారు. మహిళలు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



శారీరన్‌లో పాల్గొన్న మహిళలు

సంబరంలా సాహిత్య ఉత్సవం



పుస్తకాలను ఆసక్తిగా వీక్షిస్తున్న యువత

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సాహిత్య ఉత్సవం ఎన్నో చర్చలకు వేదికైంది. రెండురోజులపాటు జరిగిన సాహిత్య ఉత్సవంలో 350మందికిపైగా రచయితలు భాగస్వామ్యులయ్యారు. 8 వేదికల ద్వారా చర్చాగోష్టులు, సంగీత కార్యక్రమాలు కొనసాగాయి. మూడు ప్రత్యేక వేదికలు పిల్లలకోసమే కేటాయించడంతో వారిలో సాహిత్య అభిమానం, ఇతరత్రా అంశాలు పంచుకునేందుకు దోహదపడింది. రెడ్‌కౌచ్, ది వ్యాలీ వాటర్ ఫ్రంట్, లిట్‌ల్యాన్స్ న్యూబుకల్ అలర్ట్, వైల్డ్ వండర్స్, మైస్టిక్ వ్యాలీ లాంటి వేదికలు ఏర్పాటు చేశారు. కన్నడ, మలయాళం, ఇంగ్లిష్, హిందీతోపాటు వివిధ భాషల సాహితీవేత్తలు, రచయితల చర్చాగోష్టులు కొనసాగాయి. రెండు రోజుల సాహిత్య ఉత్సవానికి లలిత్ అశోక్ సందడిగా మారింది. సుమారు 25వేల మందికిపైగానే పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కృషిక సమాజ డైరెక్టర్ల ఎన్నిక

చింతామణి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కృషిక సమాజ కార్యవర్గ సమితి డైరెక్టర్‌లకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ మద్దతుదారులు 15మంది గెలుపొందారు. కార్యవర్గ సమితి సభ్యులుగా ఐదేళ్లపాటు కొనసాగనున్నారు. విజేతల వివరాలను ఎన్నికల అధికారిగా వ్యవహరించి అమర నారాయణరెడ్డి ప్రకటించారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆదివారం పోలింగ్ 3 గంటలకు ముగియగా సాయంత్రం 6 గంటలకు కౌంటింగ్ పూర్తయ్యింది. గోపాలరెడ్డి, పటేల్ అశ్వతనారాయణరెడ్డి, జయరామరెడ్డి, మంజునాథరెడ్డి, ఎన్‌వి కృష్ణప్ప, సివి గోవిందరెడ్డి, చిక్క వెంకటరవణప్ప, కే మంజునాథరెడ్డి, సీ వెంకటరెడ్డి, శ్రీనివాసులు, తాతిరెడ్డి, అల్లాబక్ష్, నంజుండగౌడ, ద్యావప్ప, బీఎస్ సతీశ్ విజేతలుగా నిలిచారు. విజేతలను మాజీ మంత్రి చౌడరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



విజేతలకు సన్మానం

ఘనంగా ఆదినారాయణస్వామి జయంతి



పూజల్లో పాల్గొన్న భక్తులు

బాగేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తొళ్లపల్లి గ్రామ పంచాయతీ సుజ్ఞానంపల్లిలో వెలసిన అవధూత ఆదినారాయణస్వామి 98వ జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణంలోని హజరత్ హసేన్‌షావలి శిష్యులుగా పేరొందిన ఆదినారాయణస్వామి జయంతిలో స్థానిక హిందూముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొనడం విశేషం. ఆదినారాయణస్వామి సమాధికి, మఠాన్ని పుష్పాలంకరణ చేశారు. కాగా ఆయన గురువు హసేన్‌షా వలి దర్గాలోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదినారాయణస్వామి, ఆయన గురువు హసేన్‌షావలి భావచిత్రాల వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. గురు శిష్య పరంపర సరిహద్దులో హిందూముస్లింల భావైక్యతకు నిదర్శనంగా సాగింది.

మాజీ ఎమ్మెల్యే నరసింహస్వామి కన్నుమూత

» ప్రముఖుల సంతాపం



నరసింహ స్వామి (ఫైల్)

దొడ్డబళ్లాపుర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ జిల్లా దొడ్డబళ్లాపుర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జే నరసింహస్వామి(78) ఆదివారం కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరు బౌరింగ్ ఆసుపత్రిలో చేరారు. చికిత్సలు ఫలించక తుదిశ్వాస వీడారు. ఆయన స్వగ్రామం తూబగెరె గ్రామంలో సాయంత్రం సొంత భూమిలో అంత్యక్రియలు జరిగాయి. నరసింహస్వామికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అహింద నాయకుడైన ఆర్‌ఎల్ జాలప్ప కుమారుడైన నరసింహస్వామి జిల్లా పంచాయతీ సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, కర్ణాటక మురికివాడల ప్రదేశాభివృద్ధి మండలి అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తూబగెరె గ్రామంలో నరసింహస్వామి పార్థివదేహానికి కడపటి నివాళులకోసం అభిమానులు, కార్యకర్తలకు అవకాశం కల్పించారు. కుమారుడు నాగేంద్రస్వామి అంత్యసంస్కారాలు నిర్వహించారు. అంత్యక్రియలలో మంత్రి మునియప్ప, న్యాయవాది ఆర్‌వీ హరీశ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు రంగప్ప, రామకృష్ణప్ప, రవిసిద్దప్ప, కృష్ణమూర్తి, మునికృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

కులగణన అవసరం

సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు రావాలంటే కులగణన అవసరమని సామాజిక విశ్లేషకుడు, మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభలో తొలుత 'కుల గణన ఎందుకు అవసరం' అనే అంశంపై ఎస్ఎన్ సాహు ప్రసంగించారు. దేశంలో ఇప్పటికీ వివక్ష పూరిత సమాజం ఉందన్నారు. మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వంటి వారు కూడా ఈ వివక్షను ఎదుర్కొన్నవారే అన్నారు. కులవివక్ష రూపాలను సరిగా అర్థం చేసుకోవాలంటే కులగణన జరగాల్సిన అవసరముందన్నారు. కేరళలో మొట్టమొదటిసారి నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక కులగణన సర్వే చేయించారని గుర్తు చేశారు. ఆ సర్వేలో అన్ని మతాల్లోనూ వివక్ష ఉందని స్పష్టమయిందని తెలిపారు. అంబేద్కర్ వ్యాఖ్యానించినట్లు దేశంలో ఉన్న నిచ్చెనమెట్ల వ్యవస్థలో పైకి పోయేకొద్దీ వివక్ష తగ్గుతుందని, దిగువకొచ్చేసరికి అంత పెరుగుతుందని స్పష్టం చేశారు.

ఫ్రీలాన్స్ జర్నలిస్టు మాలిని సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... బస్తరులో హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు అక్కడి అడవుల్లోని విలువైన ఖనిజాన్ని కట్టబెట్టేందుకు ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తీవ్రవాద ముద్రవేసి అమాయక ఆదివాసీలపై భద్రతా బలగాలద్వారా హింసకు పాల్పడుతున్నారని విమర్శించారు. మందుపాతర పెట్టారన్న నెపంతో ఒక గ్రామంలో 127 మంది ఆదివాసీలను ఎన్ఐఏ అరెస్టు చేసి ఐదేళ్లు జైల్లో పెట్టిందని తెలిపారు. ఆ తర్వాత వారంతా నిర్దోషులుగా బయట పడ్డారని, అంతలోపు ఆ కుటుంబాలు చిన్నాభిన్నమైపోయాయని విచారం వ్యక్తం చేశారు. నూతన విద్యావిధానంపై రచయిత కొప్పర్తి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం ప్రైవేటీకరణను ప్రోత్సహించేదిగా ఉందన్నారు. పాఠ్యాంశాలను మార్చి కాషాయీకరణ చేసే చర్యలు అందులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శి రాజేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, డాక్టర్ ప్రసూన, ఎస్ఎం బాషా, రసూల్, కాంగ్రెస్ నాయకుడు దాదా గాంధీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు

జాతీయస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, కేటీటీఏ అధ్యక్షుడు రక్షా రామయ్య

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కంఠీరవ ఇన్‌డోర్ స్టేడియంలో కర్ణాటక టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (కేటీటీఏ) ఆధ్వర్యంలో జాతీయస్థాయి పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. టోర్నీని ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, కేటీటీఏ అధ్యక్షుడు రక్షా రామయ్యలు టెన్నిస్ ఆడడం ద్వారా టోర్నీకి శ్రీకారం చుట్టారు. టోర్నీలో 29 రాష్ట్రాలనుంచి దేశవ్యాప్తంగా 1693కుపైగా క్రీడాకారులు పాల్గొననున్నారు. ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించేలా స్టేడియంను ఆధునీకరించారన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక వికాసం సాధ్యమన్నారు. టేబుల్ టెన్నిస్‌కు ప్రముఖక్రీడగా ఆదరణ పొందుతోందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మంజునాథ్, క్రీడా ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వక్కలిగ సంఘం అధ్యక్షుడిగా కెంచప్పగౌడ



కెంచప్పగౌడ, తదితరులకు సన్మానం

బెంగళూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన సంఘాలలో ఒక్కటైన వక్కలిగ సంఘం అధ్యక్షుడిగా బీ కెంచప్పగౌడ ఎన్నికయ్యారు. ఆదివారం ఒక్కలిగసంఘం రాష్ట్రస్థాయి పదాధికారుల ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా ఎల్ శ్రీనివాస్, డాక్టర్ కేబీ రేణుకాప్రసాద్ ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా కోనప్పరెడ్డి, కోశాధికారిగా ఎన్ బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా హనుమంత రాయప్ప ఎన్నికైనట్టు సంఘం ప్రకటించింది.

లోక్‌అదాలత్‌లో 256 కేసులు పరిష్కారం

శిడ్లఘట్ట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. కోర్టులో 593 కేసులకుగాను 256 కేసులు పరిష్కారమయ్యాయి. సివిల్ న్యాయాధికారి మహ్మద్ రోషన్‌షా మాట్లాడుతూ పరస్పరం వైషమ్యాలు వీడి కక్షిదారులు రాజీ చేసుకోవడం ద్వారా పలు కేసులు పరిష్కారం కావడం అభినందనీయమన్నారు. తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, కార్యదర్శి సీజీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులు

రూ.10 లక్షల విలువైన బైక్‌లు స్వాధీనం

బాగేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి పట్టణ పోలీసులు నిర్వహించిన కార్యాచరణలో బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10లక్షల విలువైన 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జూలై 14న వెంకటాచారి అనే వ్యక్తి తన ద్విచక్రవాహనానం కనిపించలేదని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక కార్యాచరణ నిర్వహించారు. చివరకు సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమంత్, మణికంఠ అనే నిందితులను అరెస్టు చేశారు. వారినుంచి రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోరీలకు పాల్పడిన 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. యశ్వంతపుర, యలహంక న్యూటౌన్, హిరియూరు, మాదనాయకనహళ్ళి తదితర స్టేషన్‌లలో కేసులు ఉన్నట్టు గుర్తించారు. జిల్లా ఎస్పీ కుశాల్ చౌక్సి ఆదేశాల మేరకు పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. కేసును చేధించిన పోలీసు సిబ్బందిని ప్రశంసించారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు